పామాయిల్ ఫ్యాక్టరీల్లో పనులను పూర్తి చేయాలి

పామాయిల్ నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

అశ్వారావుపేట, డిసెంబర్ 16: అశ్వారావుపేట, అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆయిల్ ఫెడ్ ఫైనాన్స్ మేనేజర్ తిరుమలేశ్‌రెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన ఆయా ఫ్యాక్టరీల్లో చేపడుతున్న పనులను పరిశీలించి మాట్లాడారు. అనంతరం ఆయిల్‌పాం నర్సరీలను పరిశీలించారు. రైతుల డిమాండ్‌కు అనుగుణంగా మొక్కలు సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు.

కొబ్బరి ఉత్పత్తులపై అధ్యయన యాత్ర విజయవంతం

అశ్వారావుపేట, డిసెంబర్ 16: మండలానికి చెందిన పలువురు రైతులు కొబ్బరి ఉత్పత్తులపై అధ్యయనం కోసం దక్షిణ భారతంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. నిపుణులు, ఆయా ప్రాంతాలకు చెందిన రైతులతో మాట్లాడి పలు అంశాలు తెలుసుకున్నారు. కొబ్బరి సాగులో చీడ పీడల నివారణ, కొబ్బరి ఉత్పత్తులపై అధ్యయనం చేసి శనివారం స్వగ్రామాలకు తిరిగి వచ్చారు.

108 వాహనంలో ప్రసవం

చండ్రుగొండ, డిసెంబర్16: వెంకట్యాతండా పంచాయతీ పరిధిలోని వంక నంబర్‌కు చెందిన బొర్ర నందిని నిండు గర్భిణి. ఆదివారం అర్ధరాత్రి ఆమెకు పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు 108లో చండ్రుగొండ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్నారు. మార్గ మధ్యంలో నొప్పులు అధికమవడంతో 108 సిబ్బంది గర్భిణికి సాధారణ ప్రసవం చేశారు. నందిని ఆడబిడ్డకు జన్మనిచ్చింది. సిబ్బంది తల్లీబిడ్డను ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

ఉత్సాహంగా 'క్రాస్ కంట్రీ' పోటీలు

దమ్మపేట రూరల్, డిసెంబర్ 16: అంకంపాలెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో తొలిరోజు శనివారం ఉత్సాహంగా జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ (పరుగు పందెం) పోటీలు కొనసాగాయి. పోటీలను ప్రిన్సిపాల్ అనూష ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందించారు. పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన 30 మందిని ఈ నెల 23న కామారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కారంగుల మహీధర్ తెలిపారు. పోటీలను జిల్లా అథ్లెటిక్స్ కోచ్ నాగేందర్, పీఈటీలు శ్రీజ, రవి, గిరి, ప్రసాద్ పర్యవేక్షించారు.

గంజాయి పట్టివేత

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 16 : అక్రమంగా తరలిస్తున్న గంజాయిని శనివారం ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. వివరాల్లోకెళ్తే.. జిల్లా అబ్కారీ అధికారి జానయ్య ఆదేశాల మేరకు అసిస్టెంట్ అబ్కారీ అధికారి కరంచంద్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది లక్ష్మీదేవిపల్లి మండలం ఇల్లెందు క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈక్రమంలో ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా వెళ్తూ కనిపించారు. సదరు యువకులను ఎక్సైజ్ అధికారులు అడ్డగించి తనిఖీ చేశారు. వారివద్ద నుంచి రూ.2.25 లక్షల విలువైన 9కిలోల గంజాయితోపాటు, సెల్‌ఫోన్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరు యువకులపై కొత్తగూడెం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.జయశ్రీ కేసు నమోదు చేసి అనంతరం కోర్టులో హాజరుపరిచారు. దాడుల్లో ఎస్సైలు గౌతమ్, అశోక్, సిబ్బంది హబీబ్ పాషా, రామకృష్ణ గౌడ్, వెంకట్ నారాయణ, గురవయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస అధ్యయనోత్సవాలు

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 16: మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి జనవరి 15 వరకు ధనుర్మాస, వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ మేనేజర్ వెంకట రమణ తెలిపారు. స్వామి వారికి సుప్రభాత సేవ, ఆరాధన, సేవాకాల, నిత్యపాశుర విన్నపం, గోదాదేవి, స్వామి వారి గ్రామ సేవ ఉత్సవాలు చేపడతామన్నారు. 23న వైకుంఠ ఏకాదశి, శ్రీస్వామివారి ఉత్తర ద్వార దర్శనం, శ్రీస్వామి గరుడ సేవ నిర్వహిస్తామన్నారు. జనవరి 14న బోగి పండుగ, 15న గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

వేంకటేశ్వరుని కల్యాణ మహోత్సవం

బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ఘనంగా స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ సిబ్బంది తీర్థ ప్రసాదాలు అందించారు.

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తెలంగాణ వచ్చాకే సింగరేణి అభివృద్ధి

టేకులపల్లి, డిసెంబర్ 16: తెలంగాణ వచ్చాకే సింగరేణి అభివృద్ధి జరిగిందని, నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సంస్థ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దండిగాల రాజేందర్ అన్నారు. ఇల్లెందు సింగరేణి ఏరియా కోయగూడెం ఉపరితల గనిలో శనివారం టీబీజీకేఎస్ నాయకులు రంగనాథ్, ఆర్.అశోక్‌కుమార్ అధ్యక్షతన కార్మికులతో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో వేలాది మంది యువత సింగరేణిలో కారుణ్య నియామకాలు, ఎక్స్‌టర్నల్ విభాగాల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. వీరంతా మొదటిసారి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఓటు వేయబోతున్నారన్నారు. వారంతా టీబీజీకేఎస్‌ను ఎన్నికల్లో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, రాజు, సత్యనారాయణ, రామకృష్ణ, గౌస్‌మియా, అజీజ్, భూక్యా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దండిగాల రాజేందర్

మాజీ ఎమ్మెల్యే 'మెచ్చా' ప్రత్యేక పూజలు

దమ్మపేట, డిసెంబర్ 16: దమ్మపేటలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ దారా యుగంధర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు యార్లగడ్డ బాబు, నాయకులు పానుగంటి చిట్టిబాబు, వీరబాబు, ఏసుబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, ఉయ్యాల లక్ష్మీనారాయణ, అబ్దుల్ జిన్నా, మణికంఠ, లాలు, గణేశ్ ఉన్నారు.

ఇరుముడి పూజల్లో మెచ్చా నాగేశ్వరరావు

పరామర్శ

దమ్మపేట రూరల్, డిసెంబర్ 16: మండలంలోని జగ్గారానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సున్నం కృష్ణ తండ్రి శనివారం మృతిచెందాడు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి పార్టీ నాయకుడు కృష్ణను పరామర్శించారు. బాధిత కుటుంబానికి సంతాపం తెలిపారు.

నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారుల నియామకం

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ఐదు నియోజకవర్గాలు, అన్ని మండలాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు, మండలాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పర్యవేక్షణ చేయాలని సూచించారు. పినపాక నియోజకవర్గానికి డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రాజు, ఇల్లెందు నియోజకవర్గానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, కొత్తగూడెం నియోజకవర్గానికి ఆర్డీవో శిరీష, అశ్వారావుపేట నియోజకవర్గానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధవి, భద్రాచలం నియోజకవర్గానికి ఆర్డీవో మంగీలాల్‌ను నియమించారు. మండలాలకు ఆళ్లపల్లికి డీఏవో వెంకటేశ్వర్‌రెడ్డి, అన్నపురెడ్డిపల్లికి డీఏస్సీడీవో అనసూర్య, అశ్వాపురానికి మత్స్యశాఖాధికారి వీరన్న, అశ్వారావుపేటకు డీవీవో పురంధర్, భద్రాచలానికి జడ్పీ డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, బూర్గంపాడుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ తిరుమలేష్, చండ్రుగొండకు మైనార్టీ అధికారి సంజీవరావు, చర్లకు డీఏవో అభిమన్యుడు, చుంచుపల్లికి డీఐఈ సులోచనారాణి, దమ్మపేటకు పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, దుమ్ముగూడేనికి డీఎఫ్‌ఎవో పురంధర్‌రెడ్డి, గుండాలకు డీసీవో వెంకటేశ్వర్లు, జూలూరుపాడుకు ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, కరకగూడేనికి ఏడీ మైన్స్ జైసింగ్, లక్ష్మీదేవిపల్లికి డీఎంఓ ఆలీం, ములకలపల్లికి డీజీడబ్ల్యూవో బాలు, పాల్వంచకు డీఐసీ జీఎం సీతారాంనాయక్, పినపాకకు ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, సుజాతనగర్‌కు డీఎం సీవిల్ సప్లై త్రినాథ్‌బాబు, టేకులపల్లికి ఉపాధి కల్పన అధికారి విజేత, ఇల్లెందుకు జిల్లా హార్టికల్చర్ అధికారి జినుగు మరియన్న, కొత్తగూడేనికి జిల్లా ఇరిగేషన్ అధికారి అర్జున్‌లను నియమించారు.

ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఎదురుకాల్పులు

భారీగా మావోయిస్టుల డంపు స్వాధీనం

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 16 : ఛత్తీస్‌గఢ్ అడవుల్లో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య శనివారం ఉదయం భీకర పోరు జరిగింది. వివరాల్లోకెళ్తే.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని కోరమ్ అడవుల్లో గంగలూర్ ఏరియా కమిటీ కార్యదర్శి దినేష్ మోడియం, ఎల్‌ఓఎస్ కమాండర్ దులా కారం ఆధ్వర్యంలో మావోయిస్టు పార్టీ క్యాంపు ఏర్పాటు చేసి, సమావేశం నిర్వహిస్తున్నారని పోలీస్‌శాఖకు సమాచారం అందింది. దీంతో డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, ఎస్‌టీఎఫ్, కోబ్రా 202, 210 భద్రతా దళాల సంయుక్త ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో గాలింపులు చేపట్టారు. ఈ క్రమంలో వారికి మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులు జరిపారు. ఇరువర్గాల మధ్య సుమారు అరగంట పైనే ఎదురుకాల్పులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. కాసేపటికి జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు జవాన్లపై కాల్పులు జరుపుతూనే అక్కడి నుంచి పారిపోయారు. కాల్పుల విరమణ అనంతరం జవాన్లు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని సీజ్ చేశారు. ఘటన స్థలం నుంచి మావోయిస్టులకు సంబంధించిన ఆయుధ, మందుగుండు సామగ్రి, కరపత్రాలు, ఇతరాత్ర వస్తువులను జవాన్లు స్వాధీనపరుచుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇల్లెందు, డిసెంబర్ 16: ఇల్లెందు సివిల్‌లైన్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇల్లెందు టౌన్, సుదిమళ్ల, 21 పిట్, బొజ్జాయిగూడెం, టేకులగూడెం, రొంపేడు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు శనివారం లైన్‌మైన్ రాజశేఖర్ తెలిపారు. విని యోగదారులు ఈ విషయాన్ని గమనించివ విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

'అగ్రికల్చర్' విద్యార్థుల ఆర్థిక సర్వే

నారాయణపురంలో సర్వే చేస్తున్న విద్యార్థులు

అశ్వారావుపేట, డిసెంబర్ 16: అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ అగ్రికల్చర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు శనివారం తమ దత్తత గ్రామమైన నారాయణపురంలో ఆర్థిక సర్వే చేపట్టారు. రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతుల ఆర్థిక, సామాజిక స్థితిగతులను సేకరించారు. సాగు, పెట్టుబడి, పంటల ప్రణాళిక, వ్యవసాయ పనిముట్లు, పశువులు, ఆదాయం, నీటి వినియోగంతో పాలు పలు అంశాలపై రైతులతో మాట్లాడారు. వారి వెంట కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ కృష్ణ తేజ, దత్తత గ్రామ బృందం అధ్యక్షుడు డాక్టర్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలపై నివేదిక ఇవ్వండి

ఇల్లెందు, డిసెంబర్ 16: పట్టణ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలపై నివేదిక ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఆదేశించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పైపులైన్ లీకేజీ, పారిశుధ్య పనులకు సంబంధించిన అన్ని వివరాలను సేకరించాలన్నారు. అనంతరం వాటి పరిష్కారానికి కార్యచరణ రూపొందించాల్సి ఉంటుందన్నారు. పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఆర్ఐ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ శ్రీను, మిషన్ భగీరథ డీపీఎం విజయ్ తదితరులున్నారు.

18 ఏళ్లు నిండిన ఓటు హక్కు పొందాలి

దమ్మపేట రూరల్, డిసెంబర్ 16: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందాలని తహసీల్దార్ ముజాహిద్ సూచించారు. దమ్మపేట తాహసీల్ కార్యాలయంలో శనివారం పలు రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఓటర్ జాబితా, కొత్త ఓటర్ల నమోదు తదితర విషయాలపై చర్చించారు.

భద్రాద్రికి రామభక్తుల పాదయాత్ర

పాదయాత్రగా భద్రాద్రికి వెళ్తున్న రామభక్తులు

అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 16: ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా ముల్లేటికి చెందిన 90 మంది భక్తులు రామకోటిని లిఖించి, ఆ పుస్తకాలను భద్రాద్రి రామయ్య పాదాల చెంతకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ 8న పాదయాత్రగా భద్రాచలం బయల్దేరారు. శనివారం వారు అశ్వారావుపేట పట్టణానికి చేరుకున్నారు. ఈ నెల 19న భద్రాచలం పట్టణం చేరుకుంటామన్నారు. మార్గమధ్యం వారికి వివిధ గ్రామాల ప్రజలు వసతి, భోజన ఏర్పాట్లు చేశారని రామభక్తులు తెలిపారు.

కిష్టారంలో గ్రామసభ

గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో

రామవరం, డిసెంబర్ 16 : సింగరేణి కొత్తగూడెం ఏరియా సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామంలో రెవెన్యూ పరిధిలోని 36 ఎకరాల రెండు పావుగుంటల భూమిని సింగరేణి సంస్థ భూ సేకరణ నిమిత్తం నోటిఫికేషన్ ద్వారా లోగడ సేకరించారు. ఈ భూసేకరణలో భాగంగా ప్రాథమిక నోటిఫికేషన్‌ను కలెక్టర్ జారీ చేయగా, తదుపరి చర్యగా శనివారం కిష్టారంలో గ్రామసభ నిర్వహించారు. సర్వేనంబర్, విస్తీర్ణం, పేరు విషయంలో అభ్యంతరాలున్న రికార్డులను కల్లూరు ఆర్డీవో అశోక్ చక్రవర్తి పరిశీలించారు. ఈ గ్రామసభలో కిష్టారం ఓసీ పీవో ఎంవీ నరసింహారావు, సర్పంచ్ రేణుక ఈశ్వర్, సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్ తావుర్యా, గ్రామస్తులు పాల్గొన్నారు.